క్లుప్తంగా

కొలనుభారతిలో డీఏఓ పూజలు



కొత్తపల్లి: మండలంలోని పవిత్ర పుణ్యక్షేత్రమైన కొలనుభారతిదేవి అమ్మవారిని ఆదివారం నంద్యాల జిల్లా డీఏఓ మోహన్‌రావు దర్శించుకున్నారు. ఆలయాన్ని చేరుకున్న ఆయనకు ఆలయ పురోహితులు సంప్రదాయానుసారం స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారికి కుంకుమార్చన, పుష్పార్చన, మంగళహారతి వంటి విశేష పూజా కార్యక్రమాలు చేశారు. ఆలయ పురోహితులు జేడీని పూల మాలతో, దుశ్శాలువలతో సన్మానించి అమ్మ వారి చిత్రపటాన్ని బహూకరించారు. అనంతరం సప్తశివాలయాలను సందర్శించారు.

శ్రామిక గర్జనను జయప్రదం చేయండి

ఆత్మకూరు: దేశ రాజధాని ఢిల్లీలో ఈ నెల 9వ తేదీన నిర్వహిస్తున్న శ్రామిక గర్జనను విజయవంతం చేయాలని సీపీయం, సీఐటీయూ పట్టణ కార్యదర్శి రామ్‌నాయక్, రణధీర్ పిలుపునిచ్చారు. పట్టణంలోని కొత్తబస్టాండ్ ఎదుట ఆదివారం బైక్‌ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు నరసింహనాయక్, స్వాములు, మాబాష, వీర్నన్న, మహబూబ్‌బాష తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్ నిర్మాణానికి భూమిపూజ



భూమి పూజ చేస్తున్న ఎంపీపీ, నాయకులు

వెలుగోడు: శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి నిధులతో ఏర్పాటు చేస్తున్న మినరల్ వాటర్ ప్లాంట్‌కు ఆదివారం ఎంపీపీ లాలం రమేష్, వైఎస్సార్‌సీపీనాయకులు భూమిపూజ చేశారు. స్వచ్ఛమైన నీటిని అందించాలనే ఉద్దేశంతో ఎమ్మెల్యే గ్రామానికి మినరల్ వాటర్ ప్లాంట్‌ను మంజూరు చేశారని, ఈ ప్లాంట్ స్థానికులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఆరోగ్యంగా జీవించడానికి స్వచ్ఛమైన నీరు ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బ్రహ్మానంద రెడ్డి , వైస్ ఎంపీపీ కొడావత్ శంకర్ నాయక్ , వైఎస్సార్‌సీపీ మండల ప్రధాన కార్యదర్శి కాసారపు రామ్మోహన్ రెడ్డి, మాధవరం సుంకన్న తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే ఆర్థిక సాయం

ఆత్మకూరు: మండలంలోని ఎస్‌ఎస్‌తండా గ్రామానికి చెందిన బాధిత కుటుంబసభ్యులకు ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ఆర్థిక సాయం అందజేశారు. ఇటీవల మండలంలోని అమలాపురం గ్రామంలో ఆటో, ట్యాంకర్ ఢీ కొన్న సంఘటనలో చనిపోయిన, గాయపడిన వారి కుటుంబసభ్యులకు ఆదివారం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే రూ.60 వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. కుటుంబసభ్యులకు ఇన్సూరెన్స్ కూడా త్వరలోనే అందిస్తామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో సిద్ధాపురం వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షులు సయ్యద్‌మీర్, నాయకులు శివశంకర్‌నాయక్, లక్ష్మిరెడ్డి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మహానంది ధర్మకర్తల మండలి సమావేశం

మహానంది: మహానందీశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం ధర్మకర్తల మండలి సమావేశం నిర్వహిస్తున్నట్లు ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కొమ్మా మహేశ్వరరెడ్డి అధ్యక్షతన 16వ సమావేశం జరుగుతుందన్నారు. ఈ నెల 14న ప్రొద్దుటూరులోని అమ్మవారిశాలలో శ్రీ మహానందీశ్వరస్వామి కల్యాణం జరుపడంపై, పడితరం స్టోర్ వద్ద సిమెంట్ కాంక్రిట్ వేసే పనులపై చర్చిస్తారన్నారు. వీటితో పాటు అన్నప్రసాద భవనం వద్ద కూరగాయలు చెడిపోకుండా కోల్డ్‌స్టోరేజీ ఏర్పాటు, జూలై నెలకు సంబంధించిన జమా, ఖర్చులు, అన్నప్రసాద విభాగం ఖర్చుల గురించి చర్చిస్తారని చెప్పారు. ఉదయం 11గంటలకు సమావేశం ఉంటుందన్నారు.

శ్రీశైలంలో సామాన్య భక్తులకు పెద్దపీట

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో ఉభయ దేవాలయాల్లో అన్ని ఆర్జితసేవల్లో సామాన్య భక్తులకు పెద్దపీటవేస్తూ సకల సదుపాయాలు కల్పిస్తున్నట్లు దేవస్థాన ఈఓ ఎస్.లవన్న తెలిపారు. ఈ మేరకు ఆదివారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. ప్రతిరోజు ఉదయం, సాయంత్రం మహామంగళహారతి ప్రారంభ సమయం నుంచే భక్తులను దర్శనానికి అనుమతించడం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రతి మంగళవారం నుంచి శుక్రవారం వరకు మధ్యాహ్నం 2 నుంచి 4గంటల వరకు ఉచిత స్పర్శదర్శనాన్ని కల్పిస్తున్నామని తెలిపారు. అలాగే భక్తులు సులభంగా సేవా టికెట్లను పొందేందుకు మే నెల నుంచి అన్ని ఆన్‌లైన్ విధానం ప్రవేశపెట్టామని, ఇటీవల దేవస్థానం యాప్‌ను కూడా అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. అంతేకాకుండా తెల్లరేషన్ కార్డు కలిగిన సామాన్య భక్తులు నెలలో ఒకరోజు ఉచిత సామూహిక సేవ జరిపించుకునే అవకాశాన్ని కల్పించినట్లు పేర్కొన్నారు.

పుంగనూరు ఘటనకు బాబే కారకుడు

- అప్పటికప్పుడు రూట్ మ్యాప్ మార్చి టీడీపీ శ్రేణులను రెచ్చగొట్టారు
- పోలీసు వాహనాలపై పెట్రోలు పోసి నిప్పంటించిన తెలుగు తమ్ముళ్లు
- చంద్రబాబుపై క్రిమినల్ కేసు నమోదు చేయాలి
- ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ డిమాండ్



అంబేడ్కర్ విగ్రహం వద్ద మాట్లాడుతున్న ఎమ్మెల్యే తొగురు ఆర్థర్

నందికొట్కూరు: చిత్తూరు జిల్లా పుంగనూర్ ఘటనకు టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడే కారణమని ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ అన్నారు. అప్పటికప్పుడు రూట్ మ్యాప్ మార్చి టీడీపీ శ్రేణులను రెచ్చగొట్టి పోలీసులపై దాడికి కారణమైన ఆయనపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పుంగనూర్‌లో సంఘటనకు వ్యతిరేకంగా వైఎస్సార్‌సీపీ శ్రేణులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పుంగనూర్‌లో పోలీసులపై దాడి చేయడమే కాకుండా వారి వాహనాలపై పెట్రోల్ పోసి నిప్పంటించిన ఘటనకు టీడీపీ అధినేత చంద్రబాబే బాధ్యుడని, ఆయనను అరెస్టు చేయాలన్నారు. అనుమతి పొందిన రూట్‌లో చంద్రబాబు పర్యటన కొనసాగించకుండా మ్యాప్ మార్చి టీడీపీ గుండాలను రెచ్చగొట్టి పోలీసులు, వైఎస్సార్‌సీపీ నాయకులపై, కార్యకర్తలపై రాళ్లు, కర్రలు, బీరు బాటిళ్లతో దాడులు చేయించి విధ్వంసం సృష్టించిన బాబును చట్ట పరంగా శిక్షించాలన్నారు.

ప్రణాళికలతో దాడులు

14 ఏళ్లు సీఎంగా ఉన్న చంద్రబాబు శాంతి భద్రతలకు తీవ్ర విఘాతం కలిగించడం ఎంత వరకు సమంజసమని ఎమ్మెల్యే ప్రశ్నించారు. రక్తపాతమే లక్ష్యంగా ప్రాజెక్టుల పరిశీలన ముసుగులో పక్కా ప్రణాళికలతో దాడులకు టీడీపీ శ్రేణులు దిగడం సబబుకాదన్నారు. రెచ్చగొట్టే ప్రసంగాలతోనే పుంగనూర్‌లో విధ్వంసం జరిగిందని చెప్పారు. ముందస్తు పథకం ప్రకారం విధి నిర్వహణలో ఉన్న పోలీసులపై, వైఎస్సార్‌సీపీ నాయకులపై దాడి చేయడం హేయ్యమైన చర్య అన్నారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమి డైరెక్టర్ అబ్దుల్ షుకూర్, హౌసింగ్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ రమాదేవి, వడ్డేర కార్పొరేషన్ డైరెక్టర్ రామసుబ్బయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ రబ్బానీ, కౌన్సిలర్లు ధర్మారెడ్డి, జాకీర్, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు వెంకటరమణ, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ సభ్యులు దిలీప్, నాయకులు పాల్గొన్నారు.

మహానంది దేవస్థానానికి కుర్చీల విరాళం



కుర్చీలను ఈఓ, చైర్మన్‌కు అందజేస్తున్న దాతలు

మహానంది: మహానంది దేవస్థానంలోని అన్నప్రసాద వితరణ విభాగానికి మహానందికి చెందిన భూమా సుబ్బరామయ్య బ్రదర్స్ రూ.40వేల విలువ చేసే 50 కుర్చీలను విరాళంగా అందించారు. ఆదివారం ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కొమ్మా మహేశ్వరరెడ్డి, ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో భూమా కృష్ణమూర్తి కుమారులు సుబ్బరామయ్య, శంకరయ్య, హరినాథ్‌బాబు, జర్నలిస్ట్ భూమా మహేష్‌లు సంయుక్తంగా కుర్చీలను అందజేశారు. దాతలకు ఆలయ ఈఓ, చైర్మన్ స్వామి,అమ్మవారి ప్రసాదాలు అందించారు.

పంచాయతీ ఉప ఎన్నికల నోటిఫికేషన్ జారీ

- జూపాడుబంగ్లాలో 7వ వార్డు, తర్తూరులో 2వ వార్డు మెంబర్ల స్థానాలు ఖాళీ
- ఈనెల 8 నుంచి నామినేషన్ల స్వీకరణ
- ఆయా గ్రామపంచాయతీల్లో అమల్లోకి వచ్చిన ఎన్నికల కోడ్

జూపాడుబంగ్లా: ఖాళీగా ఉన్న వార్డు మెంబర్లు, సర్పంచ్‌ల స్థానాల భర్తీకి రాష్ట్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీచేసినట్లు ఎంపీడీఓ సుబ్రమణ్యశర్మ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఏ గ్రామంలో అయితే సర్పంచ్, వార్డుమెంబర్ల ఎన్నికలు జరుగుతాయో ఆయా గ్రామాల్లో మాత్రమే ఎన్నికల కోడ్ అమలులో ఉంటుందని తెలిపారు. మండలంలోని జూపాడుబంగ్లా గ్రామపంచాయతీ పరిధిలో 7వ వార్డుమెంబరు మోతె వెంకటమ్మ తన వార్డుమెంబర్ పదవికి రాజీనామా చేయటంతో ఆ వార్డు మెంబర్ స్థానం ఖాళీ అయినట్లు తెలిపారు. అలాగే తర్తూరు గ్రామపంచాయతీలో 2వ వార్డు మెంబరు బోయ భాస్కర్‌కు ముగ్గురు పిల్లలు సంతానం కావడంతో రాజీనామా చేసినట్లు వెల్లడించారు. దీంతో ఆ స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈనెల 8 నుంచి 10తేదీ సాయంత్రం వరకు ఆయా గ్రామ సచివాలయాల్లో నామినేషన్లు స్వీకరించనున్నట్లు తెలిపారు. 11న నామినేషన్ల పరిశీలన, 12న సాయంత్రం 5లోగా నామినేషన్లపై అభ్యంతరాలుంటే తెలియజేయవచ్చునన్నారు. 13న అభ్యంతరాలపై విచారణ, 14న సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్ల విత్‌డ్రాకు అవకాశం ఉంటుందన్నారు. 19వ తేదీ ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 1.00గంట వరకు ఆయా గ్రామాల్లోని పోలింగ్ కేంద్రంలో పోలింగ్ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. మధ్యాహ్నం 2గంటల నుంచి ఓట్లను లెక్కించి గెలుపొందిన అభ్యర్థులకు డిక్లరేషన్ ఫారం అందజేస్తామని తెలిపారు.

పోతిరెడ్డిపాడు వద్ద 860.20 అడుగుల నీటిమట్టం



పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్

జూపాడుబంగ్లా: పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ వద్ద ఆదివారం సాయంత్రం 860.20 అడుగుల నీటిమట్టం నమోదైనట్లు అధికారులు తెలిపారు. శ్రీశైలం జలాశయంలోకి జూరాల ప్రాజెక్టు నుంచి 35,837క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరుతుండగా సాయంత్రం ఆరుగంటల ప్రాంతంలో డ్యాంలో 861.20 అడుగుల నీటిమట్టం ఉన్నట్లు తెలిపారు. పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ నుంచి నీటి విడుదలకు అనుమతి లభిస్తే వెంటనే గేట్లు ఎత్తి దిగువ ప్రాంతాలకు నీరు వదులుతామని పర్యవేక్షక అధికారులు తెలిపారు. ఈనెల 8న జరిగే నీటిపారుదల శాఖ సలహాల మండలి సమావేశం తర్వాత పోతిరెడ్డిపాడు నుంచి నీటి విడుదలకు అనుమతులు లభించే అవకాశాలున్నాయని వెల్లడించారు.

ఏటా జూలై మాసంలో నీటి విడుదల

ప్రతి ఏటా జూలై మాసంలో పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ నుంచి దిగువ ప్రాంతాలకు నీటిని విడుదల చేసేవారు. ఈ ఏడాది వర్షాలు కురవడం ఆలస్యమైనందున నీటి విడుదల కాస్త ఆలస్యమవుతున్నట్లు అధికారులు తెలిపారు. 2019లో ఆగస్టు 6న శ్రీశైలం డ్యాంలో 867.40 అడుగుల నీటిమట్టం ఉండగా పోతిరెడ్డిపాడు నుంచి నీటిని విడుదల చేశారు. 2020లో జూలై 25న డ్యాంలో 851.10, 2021లో జూలై 25న 862.70, 2022న జూలై 18న 867.80 అడుగుల నీటిమట్టం ఉండగా పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ ద్వారా నీటిని విడుదల చేశారు.

గతేడాది 123.44 టీఎంసీల నీరు విడుదల

పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ దిగువన ఉన్న 12.87 లక్షల ఎకరాలకు సాగునీరు అందించేందుకుగాను గతేడాది 123.44 టీఎంసీల నీటిని దిగువ ప్రాంతాలకు విడుదల చేశారు. ఈ నీటిని బానకచర్ల నీటి నియంత్రణ వ్యవస్థ నుంచి తెలుగు గంగ కాల్వకు 64.98 టీఎంసీలు, కేసీఎస్కేప్ కాల్వకు 39.85 టీఎంసీలు, జీఎన్ఎస్ఎస్, ఎస్సార్బీసీ కాల్వలకు 18.61టీఎంసీల నీటిని వదిలినట్లు అధికారులు వివరించారు.

మల్లన్న సన్నిధిలో గుజరాత్ మంత్రి



మంత్రి బిఖుసిన్హా పమ్మార్‌కు లడ్డుప్రసాదాలను అందజేస్తున్న ఈఓ లవన్న

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలశ్రీభ్రమరాంబామల్లికార్జునస్వామివార్లను గుజరాత్ ఎండోమెంట్ ఫుడ్‌అండ్ సివిల్ సప్లై, సోషల్ జస్టిస్ మినిస్టర్ బిఖుసిన్హా పమ్మార్ ఆదివారం రాత్రి దర్శించుకున్నారు. వీరికి ప్రధానాలయ రాజగోపురం వద్ద ఈఓ ఎస్ లవన్న , అర్చకులు ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు. అనంతరం వీరు స్వామివారికి రుద్రాభిషేకం , అమ్మవారికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం అమ్మవారి ఆశీర్వచన మండపంలో అర్చకులు ఆశీర్వచనాలు పలుకగా, ఈఓ స్వామివార్ల శేషవస్త్రాలు, లడ్డుప్రసాదాలు, జ్ఞాపికను అందజేశారు.

వరి నర్సరీల పరిశీలన




నారు మడిని పరిశీలిస్తున్న ఏవో పవన్ కుమార్

వెలుగోడు: గ్రామీణ విత్తన ఉత్పత్తి పథకం ద్వారా రైతులకు 50 శాతం సబ్సిడీతో పంపిణీ చేసిన వరి విత్తనాలతో సాగు చేసిన నర్సరీలను మండల వ్యవసాయ అధికారి పవన్ కుమార్ పరిశీలించారు. మోతుకూరు గ్రామంలో ఆదివారం ఏవో నర్సరీలను తనిఖీ చేశారు. మండలానికి కేటాయించిన 10 యూనిట్లలో వెలుగోడు-8, మోత్కూరు- 1 బోయరేవుల- 1 ఏర్పాటు చేశారు. పంపిణీ చేసిన వరి విత్తనాలను మోత్కూరు గ్రామంలో బోగోలు సుభాష్ చంద్రబోస్ అనే రైతు సాగు చేసిన వరి ఎన్‌డీఆర్ఎల్-7 విత్తనాల నారుమడిని పరిశీలించి పలు సూచనలు చేశారు. రైతులు హుసేని, విజయ్, రామాంజనేయులు పలువురు పాల్గొన్నారు.

పురుగు మందుల అమ్మకాల నిలుపుదల

వేల్పనూరు గ్రామంలోని పురుగు మందుల దుకాణాన్ని ఏవో పవన్ కుమార్ తనిఖీ చేసి రూ.1.87 లక్షల విలువ చేసే పురుగు మందుల అమ్మకాలను నిలుపుదల చేశారు. పురుగు మందు దుకాణాలపై వ్యవసాయ అధికారి. పోలీసులు ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ఎటువంటి అనుమతి పత్రాలు చూపని కారణంగా 27 లీటర్ల పురుగు మందుల అమ్మకాలు నిలుపుదల చేసినట్లు ఏవో చెప్పారు.

ఏబీఎం సంఘానికి ఆర్థిక చేయూత



బోర్ మోటార్‌ను రిబ్బన్ కట్ చేసి ప్రారంభిస్తున్న డాక్టర్ బైరెడ్డి మల్లికార్జునరెడ్డి

పగిద్యాల: మండలంలోని పాత ముచ్చుమర్రి ఎస్సీ కాలనీకి చెందిన దళితుల అభ్యున్నతికి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు డాక్టర్ బైరెడ్డి మల్లికార్జునరెడ్డి రూ.3 లక్షల ఆర్థిక చేయూతను అందించి దాతృత్వాన్ని చాటారు. కాలనీలోని దళితులు ఏబీఎం సంఘంగా ఏర్పడి చర్చి అభివృద్ధి కోసం 6 ఎకరాల పొలాన్ని కొనుగోలు చేసి, బోర్ వేసుకోగా 5 ఇంచుల నీళ్లు పడ్డాయి. బోర్ మోటర్, పైపులు, ఇతర సామగ్రిని ఇప్పించాలని సంఘ పెద్దలు డాక్టర్ మల్లికార్జునరెడ్డిని కోరారు. దీంతో స్పందించిన ఆయన రూ. 3 లక్షల విలువ చేసే సామగ్రిని ఇప్పించారు. ఆదివారం ఆయన చేతుల మీదుగానే బోర్ మోటార్‌ను ప్రారంభించగా, స్థానికులు ఆయనకు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. గ్రామ సర్పంచ్ పెద్ద ఆంజనేయులు, నందికొట్కూరు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తువ్వా శివరామకృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్ బోయ మద్దిలేటి తదితరులు ఉన్నారు.

ప్రతి కుటుంబానికీ సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి
- కొత్తరామాపురంలో 'గడప గడపకు మన ప్రభుత్వం'
- బైక్ ర్యాలీతో స్వాగతం పలికిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు



లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

ఆత్మకూరు: ప్రతికుటుంబానికి సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యమని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. ఆదివారం కొత్తరామాపురంలో గడప గడప కు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు వైఎస్సార్‌సీపీ నాయకులు శివరాం, కొత్తరామాపురం రామచంద్ర ఆధ్వర్యంలో బైక్‌ర్యాలీతో స్వాగతం పలికారు. మహిళలు హారతులు, పుష్పగుచ్ఛాలు ఇచ్చి ఆహ్వానం పలికారు. కార్యకర్తలు బాణాసంచా కాల్చి సంబరాలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే గ్రామంలో ని ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్లలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. అలాగే ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి నవరత్న పథకాల ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. జగనన్న సురక్షలో ప్రజా సమ స్యలు పరిష్కరించిన ట్లు చెప్పారు. 11 రకాల సర్టిఫికెట్లను సచివాలయంలో అందజేస్తారని, అర్హత ఉంటే చాలు ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందించి పేదల అభివృద్ధికి కృషి చేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గం సమన్వయకర్త శిల్పా భువనేశ్వరరెడ్డి, ఎంపీపీ తిరుపాలమ్మ, ఎంపీటీసీ శాంతమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు రామచంద్రుడు, శివరాం,రమేష్‌బాబు, రాజశేఖర్ ,రాజునాయక్; బాలస్వా మినాయక్, లక్ష్మీదేవి, లింగస్వామి,వెంకట్, వెంకటేశ్వర్లు, రాజునాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఐకమత్యంతోనే అభివృద్ధి సాధ్యం

- ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి
- మోక్షధామం ప్రహరీ శిలాఫలకం ఆవిష్కరణ



మోక్షధామం వద్ద ప్రహరీ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

వెలుగోడు: ఐకమత్యంతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. వెలుగోడు పట్టణంలోని మోక్షధామానికి (హిందూ శ్మశాన వాటిక) ఎంపీ నిధులు రూ.19 లక్షలతో నిర్మించిన ప్రహరీని ఆదివారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆహ్లాదకరంగా, ఆధ్యాత్మిక వాతావరణంలో శ్మశాన వాటిక ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. గ్రామం నుంచి పెళ్లిళ్లు చేసుకొని బయటకు వెళ్లిపోయిన ఆడపిల్లలు ఇందుకు సహకరించడం గొప్ప విషయమన్నారు. గ్రామంలో అందరూ ఐక్యమత్యంగా ఉండాలని, భవిష్యత్‌లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు. ఎంపీ మాట్లాడుతూ.. మాజీ సర్పంచ్ అల్లె తిరుపాల్‌రెడ్డి పలుమార్లు మోక్షధామానికి నిధులు కావాలని కోరగా నా వంతుగా రూ.19 లక్షలు ఎంపీ ల్యాండ్స్ ఇచ్చానని చెప్పారు. మానవ సేవే మాధవ సేవ అన్నారు. గ్రామాభివృద్ధికి ఎల్లప్పుడు సహాయకరంగా ఉంటానని మాటిచ్చారు. మోక్షధామం అభివృద్ధికి ఎంపీపీ లాలం రమేష్ రూ.1.08 లక్షలు విరాళంగా అందజేశారు. అనంతరం ఎంపీ, ఎమ్మెల్యే, గౌండాలను కమిటీ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో వైఎస్ఆర్‌సీపీ నియోజకవర్గ నాయకుడు శిల్పా భువనేశ్వర్‌రెడ్డి, విద్యా సంస్థల చైర్మన్ రామకృష్ణారెడ్డి ,పీఆర్ ఈఈ రామ్మోహన్, మాజీ సర్పంచ్ అల్లె తిరుపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కార్యదర్శి రామ్మోహన్‌రెడ్డి, దేశం తిరుపంరెడ్డి, మోక్షధామం కమిటీ సభ్యులు ముక్కమళ్ల భాస్కర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, యాదాటి రవి, రామచంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చుండూర్ ఘటనకు 32 ఏళ్లు



అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కౌన్సిలరు, మాలమహానాడు నాయకులు

నందికొట్కూరు: గుంటూరు జిల్లా చుండూర్‌లో 8 మంది విద్యార్థుల ప్రాణాలను పొట్టన పెట్టుకున్న ఘటనకు 32 ఏళ్లు అయ్యిందని వైఎస్సార్‌సీపీ కౌన్సిలరు లాలుప్రసాద్, మాలమహానాడు నియోజకవర్గ అధ్యక్షులు నగేష్ గుర్తు చేశారు. ఆదివారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ ఆవరణలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి మాలమహానాడు నాయకులు నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని తుంగలో తొక్కి అగ్రకులాలు ఉన్నత చదువులు చదువుతున్నారని ఓర్వలేక దళిత విద్యార్థుల ప్రాణాలను బలితీసుకున్నారన్నారు. కార్యక్రమంలో మాలమహానాడు నాయకులు ప్రతాప్, స్వామిదాసు, శేఖర్, శ్రీకాంత్, శ్రీధర్, మైనార్టీ నాయకులు సలాం, తదితరులు పాల్గొన్నారు.

నేడు 'స్పందన'

నందికొట్కూరు రూరల్ : స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ రాజశేఖర్‌బాబు కోరారు. ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో అధికారులకు అందజేయాలన్నారు. మండలస్థాయి అధికారులు తప్పకుండా ఈ కార్యక్రమానికి హాజరుకావాలని సూచించారు.

పేదల గొంతుక మూగబోయింది

శ్రీశైలంప్రాజెక్ట్: ప్రజా నాట్యమండలి కళాకారుడు గద్దర్ మృతి పట్ల పలువురు సంతాపం వ్యక్తం చేశారు. అనారోగ్యంతో గద్దర్ మృతి చెందడం బాధాకరమని, పేదోళ్ల పక్షాన తన బాణీ వినిపించే గొంతుక మూగబోవడం దురదృష్టకరమని పలువురు ప్రజా సంఘాల నాయకులు అన్నారు. గద్దర్ ఉమ్మడి రాష్ట్రప్రభుత్వానికి, పీపుల్స్‌వార్ నక్సలైట్స్, జనశక్తి నక్సలైట్స్‌తో చర్చలు జరిపేందుకు వారధిగా నిలిచిన వారిలో గద్దర్ ఒకరు.సున్నిపెంటకు సమీపంలోని చిన్నారుట్లఅటవీప్రాంతం నుంచి ప్రజల పక్షాన ప్రభుత్వంతో చర్చలు జరిపించేందుకు ఆయన దగ్గరుండి నక్సలైట్లను తీసుకువచ్చారు. సాహితీవేత్తలు, కళాకారులు అభ్యుదయవాదులు గద్దర్ మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షులు వై.ఆశీర్వాదం, ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు లక్ష్మయ్య, ప్రకాష్, దళిత సంఘాల నాయకులు ప్రేమ్‌కుమార్, వీఎమ్ఎమ్ ప్రవీణ్ తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

ప్రజాగాయకుడు గద్దర్ మరణం బాధాకరం

జూపాడుబంగ్లా: ప్రజాగాయకుడు గద్దర్ మరణం బాధకరమని రజక సంక్షేమ సంఘం సీనియర్ నాయకుడు బస్తిపాటి మౌలాలి, మండల అధ్యక్షుడు రామాంజనేయులు, కార్యదర్శి నాగభూషణం, ఉపాధ్యక్షుడు ఆనంద్ అన్నారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ 1949లో జన్మించిన గద్దర్ ఇంజినీరింగ్ విద్యను అభ్యసించి ఉద్యోగం చేసేవారన్నారు. ప్రజా సంక్షేమం కోసం చేసే ఉద్యోగం వదులుకొని ప్రజా ఉద్యమంలో చేరి ఎన్నో పోరాటాల్లో పాల్గొన్నారన్నారు. అలాగే తన పాటల ద్వారా ప్రజలను చైతన్యం చేశారని తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంతో పాటు తెలంగాణ ఆవిర్భావానికి గద్దర్ ఎంతగానో కృషిచేసి, ప్రజల్లో చెరగని ముద్రవేసుకున్నారని కొనియాడారు. ఆయన మృతి బాధాకరమన్నారు. కార్యక్రమంలో 108 శ్రీనివాసులు, రవి, ఎల్ఐసీ మద్దిలేటి, గోకారి తదితరులు పాల్గొన్నారు.

బానుముక్కలలో నీటి సమస్య



మినీ ట్యాంకు వద్ద నీరు పట్టుకుంటున్న ప్రజలు

పాములపాడు: మండలంలోని బానుముక్కల గ్రామంలో వారం రోజులుగా ప్రజలు నీటి ఇక్కట్లను ఎదుర్కొంటున్నారు. గ్రామానికి వెలుగోడు మండలంలోని వీబీఆర్ నుంచి నీటి సరఫరా అవుతుంది. ప్రస్తుతం ఆత్మకూరు మండలంలోని నల్లకాల్వ గ్రామం వద్ద ఉన్న వాల్వు మరమ్మతులకు గురైంది. అయితే అధికారులు మరమ్మతు చర్యలు చేపట్టడం లేదని ప్రజలు వాపోతున్నారు. దీంతో దూర ప్రాంతాలకు వెళ్లి నీటిని తెచ్చుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. గ్రామంలోని బీసీ కాలనీలో మసీదు వద్ద అవాజ్ కమిటీ ఏర్పాటు చేసిన మినీట్యాంకు గ్రామస్తులను ఆదుకుంటోంది. ఈ ట్యాంకు లేకపోతే వ్యవసాయ బావులను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఉండేదని కాలనీ వాసులు పేర్కొంటున్నారు. అధికారులు స్పందించి వాల్వును మార్చి నీటి సరఫరాను పునరుద్ధరించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ విషయం పై పంచాయతీ కార్యదర్శి నాగార్జున రెడ్డిని వివరణ కోరగా వాల్వుని సర్పంచ్ హైదరాబాదు నుంచి తెప్పించారని, అది రాగానే బిగించి నీటి సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు.



సంధ్యవేళ పొలంలో ట్రాక్టర్ పనులు చేస్తుండగా ఆదిత్యుడి కాంతులు



అరుణవర్ణ కాంతిలో మొసలి ఆకారంలో మేఘం

ఆదిత్యుడి వర్ణాలు..!

పచ్చటి పొలాలు, పొలాల్లో ట్రాక్టర్లతో సేద్యపు పనులు చేస్తున్నారు. నింగిలో నల్లటి మేఘాలు మబ్బులు కమ్మగా సంధ్యవేళలో అస్తమిస్తున్న ఆదిత్యుడు కిరణ కాంతులు ప్రసరింపజేశాడు. మహానంది, తిమ్మాపురం పరిసరాల్లో మేఘాలు వివిధ ఆకారాల్లో దర్శనమివ్వగా, ఆదిత్యుడి వర్ణాలు పలు రంగుల్లో ప్రకృతి ప్రేమికులకు కనువిందు చేశాయి.
- మహానంది